కందపద్య లక్షణములతో చతుశ్చతుర్మాత్రాగణ వృత్తములు

| | | | |
|---|---|---|---|
| అర్చిస్సు | త/ర/మ | 9-బృహతి-21 | UU IUI - UU UU |
| | | | |
| ఉషస్ | భ/జ/మ/గ | 10-పంక్తి-47 | UII IUI - UU UU |
| కూలం | త/న/మ/గ | 10-పంక్తి-61 | UU IIII - UU UU |
| నంద | త/భ/య/గ | 10-పంక్తి-117 | UU IUI - IIU UU |
| ఆనందతార | త/ర/స/గ | 10-పంక్తి-213 | UU IUI - UII UU |
| | | | |
| చిత్రచ్ఛాయ | భ/న/య/గగ | 11-త్రిష్టుప్-127 | UII IIII - UU UU |
| కోవెల | భ/జ/స/గగ | 11-త్రిష్టుప్-239 | UII IUI - IIU UU |
| సోమ | త/న/స/గగ | 11-త్రిష్టుప్-253 | UU IIII - IIU UU |
| మంద్ర | భ/జ/భ/గగ | 11-త్రిష్టుప్-431 | UII IUI - UII UU |
| జార | త/న/భ/గగ | 11-త్రిష్టుప్-445 | UU IIII - UII UU |
| అలరు | త/భ/న/గగ | 11-త్రిష్టుప్-581 | UU IUI - IIII UU |
| సుజాత | స/జ/త/లగ | 11-త్రిష్టుప్-812 | IIU IUI - UU IIU |
| | | | |
| సన్యాసి | స/న/య/స | 12-జగతి-124 | IIU IIII - UU IIU |
| భాను | భ/న/న/మ | 12-జగతి-511 | UII IIII - IIU UU |
| రజని | భ/న/జ/య | 12-జగతి-895 | UII IIII - UII UU |
| భజన | భ/జ/న/య | 12-జగతి-1007 | UII IUI - IIII UU |
| హరవిజయ, విరతిమహతీ | త/న/న/య | 12-జగతి-1021 | UU IIII - IIII UU |
| వరరుచి | న/స/య/స | 12-జగతి-1632 | IIII IUI - UU IIU |
| ప్రమితాక్షర | స/జ/స/స | 12-జగతి-1732 | IIU IUI - IIU IIU |
| అరుణ | స/జ/భ/స | 12-జగతి-1964 | IIU IUI - UII IIU |

| | | | |
|---|---|---|---|
| పులక | భ/న/న/స/గ | 13-అతిజగతి-2047 | UII IIII - IIII UU |
| నాస | న/న/స/భ/గ | 13-అతిజగతి-3328 | IIII IIII - UU IIU |
| సరోజవదనా | న/స/న/భ/గ | 13-అతిజగతి-3552 | IIII IUI - IIU IIU |
| కుసుమస్రజ | స/న/న/భ/గ | 13-అతిజగతి-3580 | IIU IIII - IIU IIU |
| కామిని | న/స/జ/న/గ | 13-అతిజగతి-3936 | IIII IUI - UII IIU |
| ఉపసరసీ | స/న/జ/న/గ | 13-అతిజగతి-3964 | IIU IIII - UII IIU |
| శిశిర | స/జ/న/న/గ | 13-అతిజగతి-4076 | IIU IUI - IIII IIU |
| | | | |
| సిరివీణ | న/న/న/జ/లగ | 14-శక్వరి-7168 | IIII IIII - IIU IIU |
| చెలువము | న/న/స/న/లగ | 14-శక్వరి-7936 | IIII IIII - UII IIU |
| ప్రముదితవదనా | న/స/న/న/లగ | 14-శక్వరి-8160 | IIII IUI - IIII IIU |
| సలిలనాగ | స/న/న/న/లగ | 14-శక్వరి-8188 | IIU IIII - IIII IIU |
| | | | |
| మణిగణనికర, శశికళ | న/న/న/న/స | 15-అతిశక్వరి-16384 | IIII IIII - IIII IIU |

1) అర్చిస్సు, త/ర/మ, యతి (1, 6) UU IUI - UU UU

9 బృహతి 25

ఈ విశ్వమందు - నెందున్నావో
భావించలేను - భావాంభోధీ
నా వైపుఁ జూడు - నవ్వించంగన్
జీవాబ్జ మిందుఁ - జిందన్ దేనెన్.

రాత్రిన్ నభస్సు - రాజిల్లంగా
ధాత్రిన్ దమస్సు - ధారల్ నిండెన్
యాత్రీ యుషోద-యమ్మౌ వేగన్
గాత్రమ్ము విప్పు-గా నర్చిస్సుల్.

-=-=-

ప్రేమస్వరూప! - ప్రీతిన్, గామీ
కామాంతరంగ - కందర్పా! రా
నా మానసమ్ము - నాదగ్రామా
రామమ్ము వోలె - రమ్యం బయ్యెన్.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

ప్రేమస్వరూప! ప్రీతిన్,
గామీ కామాంతరంగ - కందర్పా! రా
నా మానసమ్ము నాద
గ్రామారామమ్ము వోలె - రమ్యం బయ్యెన్.

మాపాలి దైవ-మై మా పాపం
బాపంగ గోరి - ప్రార్థింతున్ రా
కాపాడు నిర్వి-కారీ, రూపా
రూపాధిదేవ - రోచిష్కారీ.

పై వృత్తమే ఒక కంద పద్యముగా - .

మాపాలి దైవమై మా
పాపం బాపంగ గోరి - ప్రార్థింతున్ రా
కాపాడు నిర్వికారీ
రూపారూపాధిదేవ - రోచిష్కారీ.

2) ఉషస్ - భ/జ/మ/గ, యతి (1, 7) UII IUI - UU UU

10 పంక్తి 47

రాముడు కనంగ - రాలేదంచున్
భామకు మనస్సు - భారమ్మాయెన్
ప్రేమకు నుషస్సు - రేపౌనంచున్
లేమయు దలంచె - లేమిన్ గుండెన్

రాస మొక చిందు - రమ్యమ్మేగా
రాస మొక విందు - రాగమ్మేగా
రాస మొక మాయ - రాకన్ రేయిన్
రాస మొక హాయి - రంజిల్లంగన్

-=-=-

ధీరు డతివేగ - దీవిన్ పారా-
వారమును దాటి - వచ్చెన్ జూడన్
సారసదళాక్షి - సాధ్విన్ సారా-
చారను ధరిత్రి - జాతన్ సీతన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

ధీరు డతివేగ దీవిన్
పారావారమును దాటి - వచ్చెన్ జూడన్
సారసదళాక్షి సాధ్విన్
సారాచారను ధరిత్రి - జాతన్ సీతన్

శ్రీరఘుకుమార - శిష్టాచారా
శారద నభంపు - జాజ్జ్వల్యమ్మా
చారు నవ రూప - స్వచ్ఛాకారా
గారుడతురంగ - గమ్యాగమ్యా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

శ్రీరఘుకుమార శిష్టా-
చారా, శారద నభంపు - జాజ్జ్వల్యమ్మా
చారు నవ రూప స్వచ్ఛా-
కారా, గారుడతురంగ - గమ్యాగమ్యా

3) కూలం - త/న/మ/గ, యతి (1, 7) UU IIII - UU UU

10 పంక్తి 61

కూలంకషమున - క్షోభల్ గల్గెన్
తేలెన్ బడవయు - తెడ్డే లేకన్
తేలున్ మునుగును - దిక్కేమో యా
లీలామయు డట - లేడా రాడా

నేలన్ సతతము - నీకై నేనే
నాలో హృదయము - నమ్మెన్ నిన్నే
పూలన్ గొలుతును - ఫుల్లాబ్జాస్యా
కేలన్ గలుపుము - కేళీలోలా

-=-=-

నేరమ్ములకయి - నేనీ కారా-
గారమ్మున కడ-గండ్లన్ వాడన్
రారా నను గన - రంగా కారా-
గారమ్మును విడు - కాల మ్మెప్డో

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నేరమ్ములకయి నేనీ
కారాగారమ్మున కడ-గండ్లన్ వాడన్
రారా నను గన రంగా
కారాగారమ్మును విడు - కాల మ్మెప్డో

చూతమ్మిక నిల - సొంపుల్, చేతుల్
చేతుల్ కలియగ - చిత్తంబెల్లన్
పూతంబయెనుగ - పూలై, ప్రీతుల్
బ్రీతుల్ గలియగ - ప్రేమౌ గాదా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

చూతమ్మిక నిల సొంపుల్,
చేతుల్ జేతుల్ కలియగ - చిత్తంబెల్లన్
పూతంబయెనుగ పూలై,
ప్రీతుల్ బ్రీతుల్ గలియగ - ప్రేమౌ గాదా

4) నంద - త/భ/య/గ, యతి (1, 6) UU IUI - IIU UU

10 పంక్తి 245

ఆనందసూను - డగుపించంగా
ఆనందవీథి - యదియే గాదా
వేణూరవమ్ము - వినిపించంగా
నా నాక మిందు - నవనిన్ డిగ్గెన్

రంగా యనంగ - రసముల్ జిమ్మెన్
రంగా యనంగ - రజనుల్ వెల్గెన్
రంగ యనంగ - స్రజముల్ బూచెన్
రంగా యనంగ - రవళుల్ మ్రోగెన్

పాడంగ రమ్ము - పదముల్ నాకై
జాడైన లేదు - సఖి నీవెందో
చూడంగ రమ్ము - సుదతీ నన్నున్
బీడైన మన్కి - విరియున్ గాదా

-=-=-

హారమ్ము వేతు - సరసా రారా
రారాజు వంచు - రహితో గొల్తున్
సారమ్ము నీవె - సరసా మారా
మారాము లేల - మదనాకారా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

హారమ్ము వేతు సరసా
రారా రారాజు వంచు - రహితో గొల్తున్
సారమ్ము నీవె సరసా
మారా మారాము లేల - మదనాకారా

సౌందర్యరూప - సరసానందా
నందాబ్ధిచంద్ర - నవచైతన్యా
ఇందీవరాస్య - హృదయంబందున్
వందింతు నిన్ను - బ్రణయోత్కర్షన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

సౌందర్యరూప సరసా-
నందా నందాబ్ధిచంద్ర - నవచైతన్యా
ఇందీవరాస్య హృదయం
బందున్ వందింతు నిన్ను - బ్రణయోత్కర్షన్

5) ఆనందతార - త/ర/స/గ, యతి (1,6) UU IUI - UII UU
10 పంక్తి 213

ఆనందతార - యాకసమందా?
కానంగ భూమిఁ - గన్పడలేదా?
తేనెల్ స్రవించు - తీయని మార్గం
బీ నేలఁ జూప - నిప్పుడు రాదా?

పూలన్ గొనండి - ముచ్చట దీరన్
మాలల్ గొనండి - మక్కువ దీరన్
శ్రీలక్ష్మి యంచుఁ - జెప్పగ భార్యల్
లీలన్ హసింతు - రీ భువి మీకై

-=-=-

పూవై సుగంధి - మోదము నీవా
యీవేళ నాకు - నిచ్ఛల కూటై
భావమ్ము ౘిందు - పద్యము తేవా
తేవారమందుఁ - దీయని పాటై

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

పూవై సుగంధి మోదము
నీవా, యీవేళ నాకు - నిచ్ఛల కూటై
భావమ్ము ౘిందు పద్యము
తేవా, తేవారమందుఁ - దీయని పాటై

నా వీణ సేయు - నాదము నీవే
నీ వేణుగాన - నిస్వనమైతిన్
జీవమ్ములోని - జిందులు నీవే
నీ విశ్వమందు - నే సగమైతిన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నా వీణ సేయు నాదము
నీవే, నీ వేణుగాన - నిస్వనమైతిన్
జీవమ్ములోని జిందులు
నీవే, నీ విశ్వమందు - నే సగమైతిన్

6) చిత్రచ్ఛాయ - భ/న/య/గగ, యతి (1, 8) UII IIII - UU UU
11 త్రిష్టుభ్ 127

ఆకసమునఁ గడు - యంద మ్మొందున్
బ్రాకట మయెగద - వర్ణాంభోధుల్
చీకటిఁ గనఁబడు - చిత్రచ్ఛాయల్
నా కనులనుఁ బలు - నక్షత్రమ్ముల్

ఆశ లిడు మదికి - నానందమ్ముల్
పాశ మిడు హృదికి - భావాశ్లేషన్
దేశ మగు మనికి - దివ్యత్వమ్మై
లేశ మగు నునికి - లేమిన్ గల్మిన్

-=-=-

మారుని జనకుఁడ - మాన్యశ్రీ రా
చేరుమ చెలియనుఁ - జిత్తోద్ధారా
చీరలను నగలను - శ్రీలన్ దేరా
తేరున దొరవలె - ధీరా రారా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

మారుని జనకుఁడ మాన్య-
శ్రీ రా చేరుమ చెలియనుఁ - జిత్తోద్ధారా
చీరలను నగలను శ్రీలన్
దేరా, తేరున దొరవలె - ధీరా రారా

సాదరముగఁ గని - సారాంబోధీ
పూదియల నలరు - మోహాంబోధీ
నాదముల వఱలు - నాదాంబోధీ
మోదముల మురళి - మ్రోఁగన్ రావా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

సాదరముగఁ గని సారాం-
బోధీ, పూదియల నలరు - మోహాంబోధీ
నాదముల వఱలు నాదాం-
బోధీ, మోదముల మురళి - మ్రోఁగన్ రావా

7) కోవెల - భ/జ/స/గగ, యతి (1, 7) UII IUI - IIU UU
11 త్రిష్టుభ్ 239

అందముల కోవె - లయె నీ సంధ్యన్
సుందరత నింపె - సొబగౌ రంగుల్
విందు లరుణాభ్ర - వితతుల్ నింగిన్
జందముల నేను - జలితమ్మైతిన్

రాగమయ గీతి - రజనీవేళన్
వేగముగఁ బాడు - ప్రియ నీ వీణన్
సాగు నిక సంత-సముతో గాలం
బాగ దిక రా న - నలరించంగా

-=-=-

నా తలయు నేడు - నరసెన్ దాతా
తాతయని బిల్వఁ - దరుణంబయ్యెన్
రీతి యిది కాని - ద్రిజగద్ధాతా
వ్రాత యది లేదు - బ్రదుకం దేలా?

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నా తలయు నేడు నరసెన్
దాతా తాతయని బిల్వఁ - దరుణంబయ్యెన్
రీతి యిది కాని ద్రిజగ-
ద్ధాతా వ్రాత యది లేదు - బ్రదుకం దేలా?

మమ్ములను జూడు - మహిపై నమ్మా
యమ్మయని బిల్వ - నలలా రమ్మా
చిమ్ము దయ నిందు - చిఱు దీపమ్ముల్
బమ్మరిల నిమ్ము - పలు హర్షమ్ముల్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

మమ్ములను జూడు మహిపై
నమ్మా యమ్మయని బిల్వ - నలలా రమ్మా
చిమ్ము దయ నిందు చిఱు దీ-
పమ్ముల్ బమ్మరిల నిమ్ము - పలు హర్షమ్ముల్

8) సోమ - త/న/స/గగ, యతి (1, 7) UU IIII - IIU UU

11 త్రిష్టుభ్ 253

ఏమివ్వవలయు - నెఱుఁగను నేనున్
నీ మానసమున - నెలపై యుండన్
బ్రేమాంబుజమును - బ్రియ యందింతున్
సోమోద్భవమగు - సుధఁ ద్రాగింతున్

మాలీ ఖలజన - మదసంహారా
లీలాంబుజకర - లిఖితాహ్లాదా
నాలో విరిసిన - నవ రాజీవా
కాలాంబుదసమ - కమలాస్యా రా

-=-=-

తేజమ్ము లలరు - దిన మా రాజున్
రాజీవనయన - రమణున్ గన్నన్
బూజింతు నతని - భువిపై రోజున్
రోజాల సరము - లొగి రాణించన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

తేజమ్ము లలరు దిన మా
రాజున్ రాజీవనయన - రమణున్ గన్నన్
బూజింతు నతని భువిపై
రోజున్ రోజాల సరము - లొగి రాణించన్

కత్తుల్ వదలుము - కదనోన్మత్తా
మత్తిల్లి ధరణి - మసిఁ జేసేవా
వత్తున్ దునుమఁగ - వల దా జిత్తుల్
చిత్తమ్ము లలర - శివమున్ దెత్తున్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కత్తుల్ వదలుము కదనో-
న్మత్తా, మత్తిల్లి ధరణి - మసిఁ జేసేవా
వత్తున్ దునుమఁగ వల దా
జిత్తుల్, చిత్తమ్ము లలర - శివమున్ దెత్తున్

9) మంద్ర - భ/జ/భ/గగ, యతి (1, 7) UII IUI - UII UU
11 త్రిష్టుభ్ 431

రాముని఼ గనంగ - రామయు వేచెన్
స్వామిని఼ గనంగ - సాధ్వియు఼ జూచెన్
శ్యాముని఼ గనంగ - జానకి గాచెన్
భీముని఼ గనంగ఼ - బేలయు నేడ్చెన్.
(హనుమంతుడు లంకలో సీతను జూచి ఆ విషయాన్ని రామునికి చెప్పు సందర్భము)

చంద్రుని఼ గనంగ఼ - జల్లని వేళన్
మంద్రపు స్వరమ్ము - మానసమందున్
సంద్రపు తరంగ - జాలిక వోలెన్
చంద్రిక యనంగ఼ - జక్కగ లేచెన్.

-=-=-

నేరమది యేమొ - నేనిట కారా-
గారమున నుంటి఼ - గష్టముతోడన్
చేరుమని యంచు఼ - జిత్తము గోరెన్
గోరిక సుమించ఼ - గూడ఼గ రావా.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నేరమది యేమొ నేనిట
కారా గారమున నుంటి఼ - గష్టముతోడన్
చేరుమని యంచు఼ జిత్తము
గోరెన్ గోరిక సుమించ఼ - గూడ఼గ రావా.

క్షేమముగ నుండె - సీతయు రామా
రామ యని నిన్ను - రామయుఁ దల్చెన్
నామ మది నీదె - నారికి మోమున్
భూమిజ యెడంద - ప్రోఁగెను నీకై.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

క్షేమముగ నుండె సీతయు
రామా రామ యని నిన్ను - రామయుఁ దల్చెన్
నామ మది నీదె నారికి
మోమున్ భూమిజ యెడంద - ప్రోఁగెను నీకై.

10) జార - త/న/భ/గగ, యతి (1, 7) UU IIII - UII UU

11 త్రిష్టుభ్ 445

ఆనందసుతుఁడ - నౌదునుఁగా నే
నా నందసుతుని - నర్చన జేయన్
నే నమ్మితి నిను - నిండగు భక్తిన్
నే నమ్మితి నిను - నేర్పుల ముక్తిన్

హారిన్ హృదయ వి-హారినిఁ దల్తున్
చోరున్ ప్రణయ కి-శోరునిఁ గొల్తున్
జారున్ నిగమ వి-చారునిఁ దల్తున్
మారున్ విజయ కు-మారునిఁ గొల్తున్

-=-=-

కొమ్మా నిజముగఁ - గోపమె, పొమ్మా
ముమ్మాటికి యది - ముక్కునఁ గాచెన్
గుమ్మా బ్రదు కిది - ఘోరమె, యమ్మో
యమ్మాయికిఁ గడు - యాగ్రహ మాయెన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కొమ్మా నిజముగఁ గోపమె,
పొమ్మా ముమ్మాటికి యది - ముక్కునఁ గాచెన్
గుమ్మా బ్రదు కిది ఘోరమె,
యమ్మో యమ్మాయికిఁ గడు - యాగ్రహ మాయెన్

ఈ రంగుల నిశి - హృద్యము, చీరన్
శ్రీరంజనివలెఁ - జెల్వముతో సిం-
గార మ్మలరఁగఁ - గట్టితివా, రా
వారించను నిను - వంచన జేయన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

ఈ రంగుల నిశి హృద్యము,
చీరన్ శ్రీరంజనివలెఁ - జెల్వముతో సిం-
గార మ్మలరఁగఁ గట్టితి-
వా, రా వారించను నిను - వంచన జేయన్

11) అలరు - త/భ/న/గగ, యతి (1, 6) UU IUI - IIII UU

11 త్రిష్టుభ్ 581

అంద మ్మనంగ - నది కరువేమో

బంధ మ్మనంగ - బరువగు నేమో

నందాత్మజుండు - ననుఁ గనఁ డేమో

యిందుంటి నిట్టు - లిఁక మునుపేమో.

అమ్మా యనంగ - నమృతము గారెన్

అమ్మా యనంగ - నలరులు బూచెన్

అమ్మా యనంగ - నట నెల వెల్గెన్

అమ్మా యనంగ - నరుసము గల్గెన్.

చిత్తమ్ము పైనఁ - జెఱఁగని స్ఫూర్తీ

చిత్తారమందుఁ - జెలువపు మూర్తీ

మత్తిల్లు చూపు - మదిర యవంగన్

మత్తిల్లినాను - మదిరను గ్రోలన్.

-=-=-

నాలోన నీవే - నవవనమాలీ

మాలల్ రచింతు - మఱిమఱి నీకై

నీలోన నేనె - నిరతసుశీలా

శ్రీలన్ని నీదు - చిఱునగవేగా.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నాలోన నీవే నవవనమాలీ

మాలీ, మాలల్ రచింతు - మఱిమఱి నీకై

నీలోన నేనె నిరతసుశీలా

శీలా, శ్రీలన్ని నీదు - చిఱునగవేగా.

హల్లీసకమ్ము - లగపడె గళ్లన్
గల్లంచు మ్రోఁగెఁ - గదలుచు గజ్జెల్
చల్లంగ రేయి - సగమయె, మొల్లల్
ఫుల్లంబు లయ్యె - ముదముల కిల్లై.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

హల్లీసకమ్ము లగపడె
గళ్లన్, గల్లంచు మ్రోఁగెఁ - గదలుచు గజ్జెల్
చల్లంగ రేయి సగమయె,
మొల్లల్ ఫుల్లంబు లయ్యె - ముదముల కిల్లై.

12) సుజాత - స/జ/త/లగ, యతి (1, 7) IIU IUI - UU IIU

11 త్రిష్టుప్ 812

జగతిన్ సుజాత - జన్మాగ్రణియో

సుగుణాలయాత్మ - శోభాస్పదయో

జగదేకకీర్తి - సంపాదితయో

ప్రగతిన్ జరించు - ప్రాగ్దేశికయో

ఎవరా సుజాత - యేమా కథయో

జవరాలి కెందు - జన్మస్థలమో

భువనాప్తుడైన - బుద్ధుం గరుణన్

జవరాలు బొందె - జన్మం బలరన్

-=-=-

సరి నీకు లేరు - శర్వా చరణ

స్మరణంబు నాకు - సర్వంబుగదా

మఱి రోగమందు - మందై కరుణా

కర యుండుమయ్య - గంగాధరణా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

సరి నీకు లేరు శర్వా

చరణ స్మరణంబు నాకు - సర్వంబుగదా

మఱి రోగమందు మందై

కరుణాకర యుండుమయ్యా – గంగాధరణా

ఇల నాకు వచ్చె - నింపై కలయున్
గలలోన నీవు - కౌగిళ్లివగన్
కల బాసె నెప్డు - గాంతున్ లలనా
లలితాస్య నిన్ను - లాస్యమ్ములతో

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

ఇల నాకు వచ్చె నింపై
కలయున్ గలలోన నీవు - కౌగిళ్లివగన్
కల బాసె నెప్డు గాంతున్
లలనా, లలితాస్య నిన్ను - లాస్యమ్ములతో

13) సన్యాసి - స/న/య/స, యతి (1, 8) IIU IIII - UU IIU
12 జగతి 124

జగమే గృహమగు - సన్యాసిని నేన్
పగ లే నెఱుఁగను - పాపమ్మగుఁగా
సుగముల్ వ్యథలును - జూడన్నొకటే
నగలున్ దులసియు - నా కొక్కటియే.

నడతున్ బథమున - నవ్వించుచు నేన్
విడుతున్ వెతలను - బ్రేమించుచు నేన్
గడతున్ దినముల - గానమ్ముల నేన్
చెడు నే నెఱుఁగను - స్నేహింతును నేన్.

-=-=-

దినముల్ గడచెను - దేవా గనవా
కనులన్ గరుణను - గానంగ ననున్
ప్రణతుల్ గొనఁగను - రావా నిను నే
నెనరున్ దలచితి - నిత్యం బిలపై.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

దినముల్ గడచెను దేవా
గనవా కనులన్ గరుణను - గానంగ ననున్
ప్రణతుల్ గొనఁగను రావా
నిను నే నెనరున్ దలచితి - నిత్యం బిలపై.

మలపై఼ గురిసిన - మంచుల్ దెలిపెన్
తెలుపౌ ఋతువును - దివ్యాంబరమున్
ఇలపై ధవళిమ - లెందున్ జలిలో఼
జలబిందువు లయె - సాంద్రాంబరమై.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

మలపై఼ గురిసిన మంచుల్
దెలిపెన్ తెలుపౌ ఋతువును - దివ్యాంబరమున్
ఇలపై ధవళిమ లెందున్
జలిలో జలబిందువు లయె - సాంద్రాంబరమై

14) భాను - భ/న/న/మ, యతి (1, 8) UII IIII IIU UU
12 జగతి 511

మాధవ యన మది - మణియె వైల్గెన్
శ్రీధర యన హృది - శివమై వెల్గెన్
భూధర యనఁ బలు - ముదముల్ గల్గెన్
నీదరి నిలువగ - నిధి నాకబ్బెన్

భానుసమముగద - వదనాభ్రమ్ముల్
వేణువు పదముల - విన మోదమ్ముల్
త్రాణయుఁ బెఱుగును - దనువున్ గానన్
మానిని బిలిచెను - మదనా యంచున్

-=-=-

రాజిత సితసుమ - రదనా రాజా
రాజిత మృదుపద - రసికా తేజా
భ్రాజిత రుచిమయ - వదనాంభోజా
పూజిత సురవర - భువనాధారా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

రాజిత సితసుమ రదనా
రాజా, రాజిత మృదుపద - రసికా తేజా
భ్రాజిత రుచిమయ వదనాం-
భోజా, పూజిత సురవర - భువనాధారా

అక్క_జ మొసగుచు - నట నా జుక్క_ల్
జొక్కి_లె మది యిట - సొబగులఁ గనఁగా
మక్కు_వ హితు లిట - మనఁగాఁ బ్రక్క_న్
బక్కు_మని నగవు - పడి లేచెన్గా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

అక్క_జ మొసగుచు నట నా
జుక్క_ల్ జొక్కి_లె మది యిట - సొబగులఁ గనఁగా
మక్కు_వ హితు లిట మనఁగాఁ
బ్రక్క_న్ బక్కు_మని నగవు - పడి లేచెన్గా

15) రజని - భ/న/జ/య, యతి (1, 8) UII IIII - UII UU
12 జగతి 895

దీపము వెలిగెను - దివ్య విభాతిన్
చాపము లలరెను - జక్కని కాంతిన్
చూపుకు సొబగిడె - జుక్కల దండల్
బాపురె రజనియు - భాసుర మాయెన్

చందన పవనము - జల్లగ వీచెన్
నందన సుమములు - నవ్వుల దోచెన్
ఇందుకిరణములు - హృద్యము లాయెన్
సుందర పౌర్ణమి - సొంపుల నిండెన్

-=-=-

రాధను నిజ మప-రాధినిగాదే
కైదున బ్రదుకయె౹ - గామిని కిప్డున్
మాధవ నిజముగ - మానిని నీదే
నీదరి పరుగిడ - నేరమె యౌనా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

రాధను నిజ మపరాధిని
గాదే, కైదున బ్రదుకయె౹ - గామిని కిప్డున్
మాధవ నిజముగ మానిని
నీదే, నీదరి పరుగిడ - నేరమె యౌనా

గాజిది హృదయము - గాంచుమ రాజా
రాజసము వలదు - రంజిల రావా
మోజయె మనసున - మోహన, తేజిన్
తేజిలు ముఖమున - దీటుగ రావా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

గాజిది హృదయము గాంచుమ
రాజా, రాజసము వలదు - రంజిల రావా
మోజయె మనసున మోహన,
తేజిన్ దేజిలు ముఖమున - దీటుగ రావా

16) భజన - భ/జ/న/య, యతి (1, 7) UII IUI - IIII UU

12 జగతి 1007

పామరుఁడ నేను - భజనలఁ జేతున్
స్వామినిఁ దలంచి - స్వరములఁ గూర్తున్
శ్యామలశరీర - శర ణిక నీవే
నామము జపింతు - ననుఁ గన రావా

సుందర పదమ్ము - సుదతియు పాడెన్
చిందిడ ముదమ్ము - చెలువము నాడెన్
కుందిడు మనమ్ము - కుతుకముతోడన్
వందల యుషస్సు-వలె వెలుగొందెన్

-=-=-

కేలను ధరించె - గిరిఁ దను లీలన్
లీలల నటించు - లిపిఁ దను వ్రాసెన్
చేలము హరించెఁ - జెరువున, క్రీడన్
బేలలు తపించి - బిరబిర నేడ్వన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కేలను ధరించె గిరిఁ దను
లీలన్, లీలల నటించు - లిపిఁ దను వ్రాసెన్
చేలము హరించెఁ జెరువున
క్రీడన్ బేలలు తపించి - బిరబిర నేడ్వన్

రాసములఁ జిందు - రసగృహవాసా
భాసురము నీదు - పలు నటనమ్ముల్
హాసములఁ జిందు - హరి సువికాసా
కాసులకుఁ బేరు-గల సిరివాసా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

రాసములఁ జిందు రసగృహ-
వాసా భాసురము నీదు - పలు నటనమ్ముల్
హాసములఁ జిందు హరి సువి-
కాసా, కాసులకుఁ బేరు-గల సిరివాసా

17) హరవిజయ - త/న/న/య, యతి (1, 7) UU IIII - IIII UU
12 జగతి 1021

చిత్తమ్మునఁ గల - చెలువపుఁ గోర్కెల్
మత్తిల్లిన తరి - మదనునిఁ జంపెన్
హృత్తాపపు సెగ - హిమమయెఁ గాదా
వృత్త మ్మది హర-విజయము గాదా.

నింగిన్ గల సిరి - నెఱ నెలఱేఁడే
భృంగమ్ముల సిరి - పృథు సుమరాశుల్
శృంగమ్ముల సిరి - సిత హిమరాశుల్
శృంగారపు సిరి - చిఱుచిఱు ముద్దుల్.

-=-=-

దేవా యనఁగను - దెరలుగఁ బూవుల్
ప్రోవై మనసున - ముదముగ నెన్నో
రావా ననుఁ గన - రసమయ ప్రోవన్
ద్రోవన్ గనపడి - రుచిరపు రూపై.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

దేవా యనఁగను దెరలుగఁ
బూవుల్ ప్రోవై మనసున - ముదముగ నెన్నో
రావా ననుఁ గన రసమయ
ప్రోవన్ ద్రోవన్ గనపడి - రుచిరపు రూపై.

నిన్నే యెపుడును - నిజముగ కన్నా
గన్నుల్ మనసున - గని ముదమందెన్
పన్నీరయె గద - పదముల విన్నన్
వెన్నై కరుగుచు - వెలుఁగుచునుంటిన్.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నిన్నే యెపుడును నిజముగ
కన్నా గన్నుల్ మనసున - గని ముదమందెన్
పన్నీరయె గద పదముల
విన్నన్, వెన్నై కరుగుచు - వెలుఁగుచునుంటిన్.

18) వరరుచి - న/స/య/స, యతి (1,8) IIII IUI - UU IIU
12 జగతి 1632

అలలుగఁ బులుంగు - లాకాశములో
మిలమిల వెలుంగు - మేఘమ్ములపై
నలరెను సరస్సు - యబ్జమ్ములతో
జెలఁగెను మనస్సు – శృంగారముతో.

విరహము తమస్సు - వేధించెనుగా
దరిసెన ముషస్సు - ధావళ్యముగా
చిరమగు తపస్సు - శ్రీలిచ్చునుగా
హరి యని నమస్సు - లర్పింతునుగా.

-=-=-

హృదయము కలంగె - నెంతో వ్యథలన్
పదములు వడంకె - భార మ్మవఁగాఁ
గదలక దృశించు - కన్నుల్ మెదలన్
మృదువుగ హసించె - మీనాక్షియుఁ దాన్.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

హృదయము కలంగె నెంతో
వ్యథలన్, పదములు వడంకె - భార మ్మవఁగాఁ
గదలక దృశించు - కన్నుల్
మెదలన్, మృదువుగ హసించె - మీనాక్షియుఁ దాన్.

వరదను విరించి-పత్నిన్ హరుస
మ్మరవిరి యవంగ - యాచింతు హృదిన్
కరుణను గనంగఁ - గావ్యాంబరమున్
వరరుచి నొసంగఁ - బ్రార్థింతుఁ దమిన్.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వరదను విరించిపత్నిన్
హరుస మ్మరవిరి యవంగ - యాచింతు హృదిన్
కరుణను గనంగఁ - గావ్యాం-
బరమున్ వరరుచి నొసంగఁ - బ్రార్థింతుఁ దమిన్.

19) ప్రమితాక్షర - స/జ/స/స, యతి (1, 7) IIU IUI - IIU IIU
12 జగతి 1732

ప్రమితాక్షరమ్ము - రమణీయముగా
నమితాక్షరమ్ము - లతిదీర్ఘముగా
క్షమితాక్షరమ్ము - సహన మ్మగుఁగా
నమితాక్షరమ్ము - నయమున్ గనుఁగా.

రమణీరవమ్ము - రసబంధురమై
గమకమ్ము తోడి - కవితాస్వరమై
ప్రమితాక్షరంపు - వరగీతికలన్
భ్రమియింపజేసె – రసికాగ్రణులన్.

-=-=-

హరిగీతిఁ బాడ - నది సుస్వరమే
వరమౌను గాదె - పరమాద్భుతమై
విరిదండ వేతుఁ - బ్రియమై చిరమై
స్థిరమైనప్రేమ - సిరులన్ గొన రా.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

హరిగీతిఁ బాడ నది సు-
స్వరమే, వరమౌను గాదె - పరమాద్భుతమై
విరిదండ వేతుఁ బ్రియమై
చిరమై స్థిరమైనప్రేమ - సిరులన్ గొన రా.

కమలాకరమ్ముఁ - గనుమా రమణా
రమణమ్ము వింత - భ్రమరాకరమా
విమలాకరమ్ము - ప్రియ హృత్కమలా
కమనీయమైన - కలయా నిజమా.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కమలాకరమ్ముఁ గనుమా
రమణా, రమణమ్ము వింత - భ్రమరాకరమా
విమలాకరమ్ము ప్రియ హృ-
త్కమలా, కమనీయమైన - కలయా నిజమా.

20) అరుణ - స/జ/భ/స. యతి (1, 7) IIU IUI - UII IIU

12 జగతి 1964

అరుణార్ణవంపు - యందపు తరగల్
స్వరరాగపూర్ణ - సంధ్యల నురగల్
చెఱుపంగరాని చెల్వపు స్మృతులై
చిరకాల మిందు - జెన్నుగ నిలుచున్

అరుణోదయంపు - యందపు కిరణా
లరుదెంచె దూర్పు - నందున సిరులై
స్వరమంగళమ్ము - బాడెను బులుగుల్
విరిబాల లూగె - వెచ్చగ వనిలో

-=-=-

వని నృత్యమాడ - వచ్చిరి కను మం-
గన లాడి పాడ - గజ్జెల సడులన్
వన మెల్ల మ్రోఁగెఁ - బాయక జనరం-
జనమై చెలంగె - జాజర పదముల్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వని నృత్యమాడ వచ్చిరి
కను మం గన లాడి పాడ - గజ్జెల సడులన్
వన మెల్ల మ్రోఁగెఁ బాయక
జనరం జనమై చెలంగె - జాజర పదముల్

కను మాకురాలు - కాలము, దినమం
దిన కాంతి తగ్గె - దీర్ఘము రజనుల్
విను గాలి వీచు - వేగము, తనువో
ధనువాయె వంగి - ధారుణిఁ జలిలో

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కను మాకురాలు కాలము,
దినమం దిన కాంతి తగ్గె - దీర్ఘము రజనుల్
విను గాలి వీచు వేగము,
తనువో ధనువాయె వంగి - ధారుణిఁ జలిలో

21) పులక - భ/న/న/స/గ, యతి (1, 8) UII IIII IIII UU

13 అతిజగతి 2047

నవ్వుల విరులను - నయముగ నీవా
దివ్వెల వెలుగులఁ - దెసలకు తేవా
పువ్వుల పడవకు - ముదముల రేవా
మువ్వల సడులకుఁ - బులకల రావా

నాకము ధరపయి - నభమున కాదోయ్
శోకము వదలుము - సుఖములు నిండున్
నీకయి కల దొక - నిఖిలము గానన్
జీకటి తొలఁగును - చిఱు వెలుఁగున్నన్

-=-=-

దూరము మెఱిసెడు - ధ్రువమగు తారా
దారికి వెలుగుల - తరగల తేవా
చేరెద గృహమును - శిశువును, దారన్
ద్వారముకడఁ గనఁ - ద్వర త్వరఁగా నేన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

దూరము మెఱిసెడు ధ్రువమగు
తారా, దారికి వెలుగుల - తరగల తేవా
చేరెద గృహమును శిశువును,
దారన్ ద్వారముకడఁ గనఁ - ద్వర త్వరఁగా నేన్

వెన్నెల మిలమిల - వెలుఁగుల కన్నా
కన్నెకు మనసునఁ - గలుగు సుఖమ్మా
చెన్నుగ నడువఁగఁ - జెలువపు తెన్నై
దిన్నగ నిక నగుఁ - దియనగు పల్కుల్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వెన్నెల మిలమిల వెలుఁగుల
కన్నా, కన్నెకు మనసునఁ - గలుగు సుఖమ్మా
చెన్నుగ నడువఁగఁ జెలువపు
తెన్నై దిన్నగ నిక నగుఁ - దియనగు పల్కుల్

22) నాస - న/న/స/భ/గ, యతి (1, 9) IIII IIII UU IIU

13 అతిజగతి 3328

నగధరు ముగమున - నాసమ్ముపయిన్
మొగవలె నగపడు - ముత్తెమ్ము సదా
జగతికి వెలుగిడు - జాజ్జ్వల్యముగా
ముగుదల మొగమున - మోహోత్సవమై

నెల బడె వెలుగుల - నీరమ్ములపై
నల లవి తళతళ - యంచున్ మెఱిసెన్
మిలమిల గగనము-మీదన్ గుమిగా
సుడివలెఁ గనబడెఁ - జుక్కల్ దివెలై

జననము మరణము - చక్రమ్ములగున్
తనువుల దహనము - తథ్యమ్ముగదా
ధనమున కిలపయి - తాపత్రయముల్
విన నొక విధమగు - వింతే యగుగా

-=-=-

కనుగవ వెలిగెను - గాంతిన్, గన నా
ఘనుని ఘనమణిని - గాలాంబుదునిన్
క్షణములు నెఱయయె - శాంతిన్ విన నా
పిన యువకు ననఘు - బృందావనిలో

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కనుగవ వెలిగెను గాంతిన్,
గన నా ఘనుని ఘనమణిని - గాలాంబుదునిన్
క్షణములు నెఱయయె శాంతిన్
విన నా పిన యువకు ననఘు - బృందావనిలో

మనసున మమతల - మాలల్ మనె నా-
మని విరుల విధము - మత్తిల్లగ నేన్
దను విటఁ గరమునఁ - దాకన్ దనివిన్
దనరుచును నిలిచె - ధావళ్యమునన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

మనసున మమతల మాలల్
మనె నామని విరుల విధము - మత్తిల్లగ నేన్
దను విటఁ గరమునఁ దాకన్
దనివిన్ దనరుచును నిలిచె - ధావళ్యమునన్

23) సరోజవదనా - న/స/న/భ/గురు, యతి (1, 8) IIII IUI - IIU IIU
13 అతిజగతి 3552

వరముల సరోజ-వదనా యియవే
స్వరములఁ గవిత్వ - సరమై యియవే
చిరమగు సువిద్య - చెలువ మ్మియవే
దరిసెనము నాకు - దయతో నియవే

చిఱునగవు నీకు - సిరి నిచ్చుగదా
విరిసరము నీకు - వెలు గిచ్చుగదా
హరుసములు నీకు - హరు విచ్చుగదా
మురిపెములు నీకు - ముద మిచ్చుగదా

-=-=-

మురహరుని నోటఁ - బొగడన్ దరమా
ధరపయినశైల-ధరుడే తరిగా
మురళి సడులందు - మోహనకరమౌ
కరడములు లేచు-గదె యీ మదిలో

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

మురహరుని నోటఁ బొగడన్
దరమా, ధరపయినశైల-ధరుడే తరిగా
మురళి సడులందు మోహన-
కరమౌ కరడములు లేచు-గదె యీ మదిలో

వరముల నొసంగు - వరదున్ గరుణా-
కరునిఁ దలచంగఁ - గలదా క్షణముల్
శరణు శరణంచు - సరిగా ధరణీ-
ధరుని దలచంగఁ - దరుణమ్ము గదా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వరముల నొసంగు వరదున్
గరుణాకరునిఁ దలచంగఁ - గలదా క్షణముల్
శరణు శరణంచు సరిగా
ధరణీధరుని దలచంగఁ - దరుణమ్ము గదా

24) కుసుమస్రజ - స/న/న/భ/గురు, యతి (1, 8)
13 అతిజగతి 3580

గగనమ్మున( గను - ఖగ మొండెగిరెన్
సిగరమ్మును గను - సితమై యుండెన్
నగరమ్మును గను - నరనారులతో
నగధారిని గను - నయ రూపముతో

హరి యంచన నతి - హరుసమ్ము గదా
పురి విప్పును మది - మురవైరి యనన్
పురుషోత్తము( డన( - బులకించు( గదా
సరసమ్మగు హృది - సరసా యన(గన్

-=-=-

కుజ మత్యరుణము - కుసుమస్రజముల్
రజనిన్ జలితము - రస మాధురులన్
త్రిజగప్రియు నట( - దెరలుచు( బ్రజ లా
వ్రజమందు( గనిరి - వరదుని( గృష్ణున్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

కుజ మత్యరుణము కుసుమ-
స్రజముల్ రజనిన్ జలితము - రస మాధురులన్
త్రిజగప్రియు నట( దెరలుచు(
బ్రజ లా వ్రజమందు( గనిరి - వరదుని( గృష్ణున్

వ్రణ మయ్యేను హృది - రణమున( బ్రణయా-
గ్రణి చేసిన దిది - బ్రదుకున సరియా
వినవేలకొ నిట - విరహపు స్వన ని-
స్వనముల్ వలపుల - ధ్వనులయె నుఋముల్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వ్రణ మయ్యేను హృది రణమున(
బ్రణయాగ్రణి చేసిన దిది - బ్రదుకున సరియా
వినవేలకొ నిట విరహపు
స్వన నిస్వనముల్ వలపుల - ధ్వనులయె నుఋముల్

25) కామిని - న/స/జ/న/గ, యతి (1, 8) IIII IUI - UII IIU

13 అతిజగతి 3396

వలపుల పదమ్ము - బాడిన దెవరో
తలుపులను మెల్ల - తట్టిన దెవరో
చెలువపు తేనె - జిందిన దెవరో
కలలను స్పృశించు - కామిని యెవరో

తెలుగున బదమ్ము - దేవుని వరమా
తెలుగున బదమ్ము - తీయని గుడమా
తెలుగున బదమ్ము - తెల్లని విరియా
తెలుగున బదమ్ము - తేనెల నదియా

-=-=-

చెలి విడెను నన్ను - జేదగు కలలోఁ
గలయయితి గాంచ - గాదిక నిలపై
తళతళ మనంగ - తారల వెలుగుల్
వెలయఁగ మనస్సు - వేదన గలగెన్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

చెలి విడెను నన్ను జేదగు
కలలోఁ గలయయితి గాంచ - గాదిక నిలపై
తళతళ మనంగ - తారల
వెలుగుల్ వెలయఁగ మనస్సు - వేదన గలగెన్

నవతను నొసంగు - నా పని, కవితా,
కవనములయందు - గల్పన లగుగా
నవతను నొసంగు - నా పని, భవితా,
భవములకు గొప్ప - భావన లగుగా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

నవతను నొసంగు నా పని,
కవితా, కవనములయందు - గల్పన లగుగా
నవతను నొసంగు నా పని,
భవితా, భవములకు గొప్ప - భావన లగుగా

26) ఉపసరసి లేక సంజన - స/న/జ/న/గ, యతి (1, 8) IIU IIII - UII IIU
13 అతిజగతి 3964

ముఱియంగను గడు - మోదము గురియన్
సరస మ్మయె నిట - సంజను గనుమా
హరుసమ్మున సఖ - హాయిగ నగుచున్
సరసా యనుచును - సంజన మవనా

చిలుకా హరిఁ గని - జెప్పవె వడిగా
నలుకన్ వలదని - యాతని కిపుడే
చిలుకన్ సుధలను - జెల్వము లలరన్
బలుకన్ బదముల - భారము దొలగన్

మనసా భగభగ - మాడితి గదవే
తనువా భుగభుగ - తాపము వలదే
విను మీ వెతలను - వేగము మఱువన్
దినమున్ రవి యరు-దెంచెను గనవే

-=-=-

చలిలో వణకితిఁ - జల్లగఁ జిలుకా
చెలికాఁడెట జనెఁ - జేరఁడు నను దాఁ
బలుకే యయెగద - బంగరు, వలపన్
వలలోఁ బడితిని - వానికి ఝుషమై

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

చలిలో వణకితిఁ జల్లగఁ
జిలుకా చెలికాఁడెట జనెఁ - జేరఁడు నను దాఁ
బలుకే యయెగద బంగరు,
వలపన్ వలలోఁ బడితిని - వానికి ఝుషమై

అల నొక్క నెలఁత - యాకృతి శిలపైఁ
జెలువమ్ము విరియఁ - జెక్కితివి కదా
శిలయో నెలఁతయొ - చిందెడు వెలుగో
విలసిల్లె మనసు - విస్మయమయమై

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

అల నొక్క నెలఁత యాకృతి
శిలపైఁ జెలువమ్ము విరియఁ - జెక్కితివి కదా
శిలయో నెలఁతయొ చిందెడు
వెలుగో, విలసిల్లె మనసు - విస్మయమయమై

27) శిశిర - స/జ/న/న/గ, యతి (1, 7) IIU IUI - IIII IIU

13 అతిజగతి 4076

గగనమ్మునందుఁ - గడు వెలుఁగులతో
సొగసీను దార - సొబగుల వెలిగెన్
సిగరమ్ము వెల్గె - శిశిరఋతువులో
రగిలేను నేను - బ్రణయపు చితిలో

స్వరదా స్వరాల - వఱదను మునుఁగన్
విరులన్ విరించి - ప్రియ కొసఁగెద నేన్
వరదా వరాల - వరమణి నియవే
పరమా పదాలఁ - బరవశమవవే

-=-=-

తరుఛాయలోనఁ - దరళతఁ జెరు వ-
చ్చెరువుగ నయ్యెఁ - జెలియరొ నిజమై
మురియంగ నందు - ముదముగఁ గరినిన్
గరిణిన్ గనంగఁ - గనులకు వరమే

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

తరుఛాయలోనఁ దరళతఁ
జెరు వచ్చెరువుగ నయ్యెఁ - జెలియరొ నిజమై
మురియంగ నందు ముదముగఁ
గరినిన్ గరిణిన్ గనంగఁ - గనులకు వరమే

తెరువున్ జనంగ - దినమున ఖరమౌ
కరముల్ దహించెఁ - గడు నిశితముగా
నరయన్ నిశీథి - నతి హితకరమౌ
కరముల్ బ్రశాంత-కరమగు సుఖమై

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

తెరువున్ జనంగ దినమున
ఖరమౌ కరముల్ దహించెఁ - గడు నిశితముగా
నరయన్ నిశీథి నతి హిత-
కరమౌ కరముల్ బ్రశాంత-కరమగు సుఖమై

28) సిరివీణ - న/న/న/జ/లగ, యతి (1, 9) IIII IIII IIU IIU
14 శక్వరి 7168

ప్రతినలు బలికిన - బతితో సతిగా
బ్రతుకుట యొక యను-భవమే యయెగా
సతమత మగుచును - సతిగా నిలపై
బ్రతికితిగద శశి - బ్రదుకే కథగా

స్వరముల గురువగు - వరరాణివిగా
చిర రవముల కొక - సిరివీణవుగా
సరసపు పదముల - సరసాబ్ధివిగా
నిరతము గొలిచెద - నిఖిలేశ్వరి నిన్

-=-=-

అట తిరుమలపై - హరి వేంకటు స-
ద్ఘటనల కిరవగు - కరముల్ దయతో
ద్రుటి నిడు వరముల - దురితోత్కటముల్
ఘటికఁ దొలగుగద - కలిలో నిలపై

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

అట తిరుమలపై హరి వేం-
కటు సద్ఘటనల కిరవగు - కరముల్ దయతో
ద్రుటి నిడు వరముల దురితో-
త్కటముల్ ఘటికఁ దొలగుగద - కలిలో నిలపై

సుపథముల నడతు - శుభ మంగపతీ
కపటముల విడితిఁ - గపిలేశ సఖా
యెపుడు హరిజపము - లికపై నపరా
యపరిమిత కరుణ - లగుపించు గదా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

సుపథముల నడతు శుభ మం-
గపతీ కపటముల విడితిఁ - గపిలేశ సఖా
యెపుడు హరిజపము లికపై
నపరా యపరిమిత కరుణ - లగుపించు గదా

29) చెలువము - న/న/స/న/లగ, యతి (1, 9) IIII IIII - UII IIU
14 శక్వరి 7936

మధురము మధురము - మాధవ యనఁగా
మధురము మధుముర - మర్దనుఁ డనఁగా
మధురము యదుకుల - మానిక మనఁగా
మధురము మధురము - మాలినిఁ గనఁగా

చెలువము చెలువము - చిన్మయుఁ డనఁగా
చెలువము చెలువము - శ్రీకరుఁ డనఁగా
చెలువము చెలువము - శ్రీపదుఁ డనఁగా
చెలువము చెలువము - చెలువునిఁ గనఁగా

-=-=-

విలసిత మయెనుగ - వింతల యలలై
యలలనఁగ గదలు - నా చికురములై
కళలను గనబడుఁ - గాటుక వలయా?
వలయము లనగను - భ్రాంతుల కలయా?

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

విలసిత మయెనుగ వింతల
యలలై యలలనఁగ గదలు - నా చికురములై
కళలను గనబడుఁ గాటుక
వలయా? వలయము లనగను - భ్రాంతుల కలయా?

చెలువముల సుధను - జిందెడు చెలియా
శిలవలెఁ గనఁబడు - చిత్రపు నెలయా
చెలువపు సరసునఁ - జిత్తకమలమా
మలహరి స్వరముల - మాలల పదమా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

చెలువముల సుధను జిందెడు
చెలియా, శిలవలెఁ గనఁబడు - చిత్రపు నెలయా
చెలువపు సరసునఁ జిత్తక-
మలమా, మలహరి స్వరముల - మాలల పదమా

30) ప్రముదితవదనా - న/స/న/న/లగ, యతి (1, 8) IIII IUI - IIII IIU
14 శక్వరి 8160

బధిరుఁడను నేను - ప్రముదితవదనా
పదములను బాడి - పరవశమగు నా
యధరములు మెల్ల - నటునిటుఁ గదలన్
గదలికలఁ గాంచఁ - గథ లవి తెలియున్

నిధి యగును వాఁడు - నిరతము మనకున్
సుధ యగును వాఁడు - సుమధుర రుచులన్
ముద మిడును వాఁడు - పువువలె మురియున్
సదమలుఁడు వాఁడు - శరణని గొలుతున్

-=-=-

వ్యథల మయమైన - బ్రదు కిది విధియా
విధవిధములైన - వెతలకు నిధియా
మధుర మయమైన - మనికియు మధువా
మదనుని బ్రసూన - మధువుల సుధయా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వ్యథల మయమైన బ్రదు కిది
విధియా , విధవిధములైన - వెతలకు నిధియా
మధుర మయమైన మనికియు
మధువా, మదనుని బ్రసూన - మధువుల సుధయా

విరహమున నాకు - వెతలకు కొరవా
కుఱుపులకు నేను - కుములను ధరపై
చెరువులయె కళ్లు - చెలువుని నరయన్
హరుసముల వాన - హరి యెపు డొసఁగున్

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

విరహమున నాకు వెతలకు
కొరవా, కుఱుపులకు నేను - కుములను ధరపై
చెరువులయె కళ్లు చెలువుని
నరయన్ హరుసముల వాన - హరి యెపు డొసఁగున్

31) సలిలనాగ - స/న/న/న/లగ, యతి (1, 8) IIU IIII - IIII IIU
14 శక్వరి 8188

వినుమా బ్రదుకున - వెతలను దయతోఁ
గనుమా బ్రదుకునఁ - గతలను గరుణన్
దినమందున బలు - దెసలకుఁ జను నా
మన మీ రజనిని - మధురతఁ గనునా

రతనమ్ములవలె - రవికిరణము ల-
ద్భుతమై జగతిని - ముదమునఁ దడిపెన్
జతగా బులుగులు - స్వరములఁ బలుకన్
శ్రుతిగా నళినులు - సొబగులఁ గులికెన్

-=-=-

అరుణోదయమున - హరుసపు సరసిన్
సరసీరుహముల - చలనము సొబగుల్
విరు లా వనమున - వికచము సరసా
సరసన్ బరుగిడి - చకచక కనరా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

అరుణోదయమున హరుసపు
సరసిన్ సరసీరుహముల - చలనము సొబగుల్
విరు లా వనమున వికచము
సరసా, సరసన్ బరుగిడి - చకచక కనరా

హరుసమ్ముగ జను - యమలిన సరితా
చరితమ్ముల బలు - చదివిన గవితా
నరమానసముల - నవరసభరితా
భరతావని సుఖ-భరిత సుచరితా

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

హరుసమ్ముగ జను - యమలిన
సరితా, చరితమ్ముల బలు - చదివిన గవితా
నరమానసముల - నవరస
భరితా, భరతావని సుఖ-భరిత సుచరితా

32) మణిగణనికరము లేక శశికళ - న/న/న/న/స, యతి (1, 9) IIII IIII - IIII IIU
15 అతిశక్వరి 16384

మణిగణనికరము - మహిపయి దళముల్
మణిగణనికరము - మలపయి హిమముల్
మణిగణనికరము - మఱి యుడుగణముల్
కనకపు శశికళ – గగనముపయినన్.

నభమున శశికళ - నయముగ విరిసెన్
శుభమగు ఘడియలు - సొబఁగిడి మురిసెన్
విభుడట నగపడు - విలసిలు మొగమున్
విభవము నెఱయఁగ బ్రి-యమగు గతులన్.

-=-=-

వరదుని దలఁపఁగ - వరములు కరువా
కరుణకు నిరవుగఁ - గనఁబడు నెపుడున్
స్వరముల సరముల - సరసుని ద్వర నా-
దరముగఁ బొగడఁగఁ - దరుణము లివియే.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

వరదుని దలఁపఁగ వరములు
కరువా, కరుణకు నిరవుగఁ - గనఁబడు నెపుడున్
స్వరముల సరముల సరసుని
ద్వర నా దరముగఁ బొగడఁగఁ - దరుణము లివియే.

సరసిజనయనుని - సరసిజకరముల్
గరగరగ ననుఁగుఁ - గవుఁగిలి నిడునా
సరసిజపదముల - సరసను విరియై
విరిసెద మురిసెద - ప్రియముగ మనికిన్.

పై వృత్తమే ఒక కంద పద్యముగా -

సరసిజనయనుని సరసిజ
కరముల్ గరగరగ ననుఁగుఁ - గవుఁగిలి నిడునా
సరసిజపదముల సరసను
విరియై విరిసెద మురిసెద - ప్రియముగ మనికిన్.